క్లుప్తంగా

వైభవంగా అభిషేకం


శివుడికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

పెద్దతిప్పసముద్రం: కార్తీక మాసోత్సవాల్లో భాగంగా సనగరం పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో శుక్రవారం శివుడికి వైభవంగా అభిషేకం నిర్వహించారు. ఆలయంలో ఏకవార రుద్రాభిషేకం, కార్తీక దీపోత్సవం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించి భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అంతేగాక భాగవతారిణి స్వర్ణలత బృందం శివలీలలుపై హరికథా కాలక్షేపం కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

హారం బహూకరణ


దశావతారం హారాన్ని అందజేస్తున్న మధుసూదన్ వర్మ దంపతులు

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి భక్తులు దశావతారం హారాన్ని బహూకరించారు. శుక్రవారం హైదరాబాదుకు చెందిన మధుసూదన్ వర్మ దంపతులు దశావతారం హారాన్ని టీటీడీ అధికారులు, అర్చకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి సన్మానించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రూ. 72,280 విలువ చేసే వెండి, బంగారం పూతతో తయారు చేసిన హారాన్ని భక్తులు కానుకగా స్వామివారికి అందజేశారు. హారానికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి అలంకరించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఇన్స్పెక్టర్ మోహన్, ఆలయ అర్చకులు గోపాలాబట్టర్, కృష్ణ, అనిల్, రాజు, గోకుల్ స్వామి పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనంపై పోటీలు


పోస్టర్‌ను తిలకిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

మదనపల్లె సిటీ: హెచ్ఐవీ–ఎయిడ్స్ డే పురస్కరించుకుని స్థానిక మహిళా డిగ్రీ కాలేజీలో శుక్రవారం విద్యార్థులకు చిత్రలేఖనం, రంగోళిపై పోటీలు నిర్వహించారు. ఆర్ఆర్ఎస్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ క్రిష్ణవేణి గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించాన్న ఉద్దేశంతో కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఆర్ఎస్ శ్వేత, అధ్యాపకులు జ్యోతి, మోహన్‌బాబు సిబ్బంది పాల్గొన్నారు.

పక్కాభవనం మంజూరు చేయాలి



నిరసన తెలుపుతున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

పీలేరు : స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలకు పక్కా భవనం మంజూరు చేయాలని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దెల అమృత్‌తేజ, జిల్లా నాయకుడు సాయి సంపత్, డీబీఎస్ఎఫ్ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు భాను ప్రకాష్ కోరారు. శుక్రవారం ప్రభుత్వ ఐటీఐ కళాశాల మెయిన్‌గేట్ ఎదుట విద్యార్థులతో కలసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐటీఐ కళాశాలకు పక్కా భవనం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో స్థలం కేటాయించడం తోపాటు రూ. 5 కోట్లు నిధులు మంజూరు చేశారని పేర్కొన్నారు. అయితే అనేక కారణాలతో నిధులు రద్దు అయ్యాయని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పక్కా భవనం మంజూరు చేయాలని కోరారు.

వాహనాల తనిఖీ


వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ

రామసముద్రం : రామసముద్రం మండల ఎంపీడీఓ కార్యాలయం నుంచి దిగువ పెట్రోల్ బంక్ వరకు ఎస్ఐ వెంకటసుబ్బయ్య శుక్రవారం వాహనాలను తనిఖీలు చేపట్టారు. రోడ్డుకు అడ్డంగా నిలిపిన వాహనాలకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహన ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. పిల్లలు వాహనాలు నడిపి పట్టుబడితే, తల్లిదండ్రులు, వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. తనిఖీల్లో హెడ్‌కానిస్టేబుల్ గంగిరెడ్డి, కిరణ్ పాల్గొన్నారు.

జగన్ హయాంలో కళకళ.. కూటమి పాలనలో ఇలా..!

- తంబళ్లపల్లె నియోజకవర్గంలో రూ.70 కోట్లతో 1,875 సిమెంట్ రోడ్లు మంజూరు
- ప్రస్తుత ప్రభుత్వం మంజూరు చేసింది రూ.7 కోట్ల పనులే
- అందులో పెద్దమండ్యంలో ఒకటి, తంబళ్లపల్లెలో ఒకటి మాత్రమే పూర్తి


తంబళ్లపల్లె మండలం మర్రిమాకులపల్లె సిమెంటు రోడ్డు


బి.కొత్తకోట మండలం తుమ్మనంగుట్టలో సిమెంటురోడ్డు

బి.కొత్తకోట: మాజీ సీఎం వైఎస్ జగన్ పాలనలో ఊరూర సీసీ రోడ్ల నిర్మాణానికి అధిక నిధులు ఖర్చు చేశారు. ఒక్క తంబళ్లపల్లె నియోజకవర్గంలోనే రూ.70 కోట్లతో.. 1,875 సిమెంట్ రోడ్లు మంజూరు చేశారు. సిమెంట్ రహదారులకు మోక్షం కల్పించారు. జగనన్న పాలనలో గ్రామాలన్నీ సీసీ రోడ్లతో కళకళలాడాయి. అయితే రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం నియోజకవర్గంలో సీసీ రోడ్ల నిర్మాణానికి కేవలం రూ. 7 కోట్లు మాత్రమే మంజూరు చేసింది. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాక మునుపు వరకు ఒక సిమెంటు రోడ్డు మంజూరు కావాలంటే ప్రజలు కాళ్లరిగేలా ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరిగేవారు. అడిగిన రోడ్డు మంజూరు చేస్తారో లేదో కూడా తెలిసేది కాదు. సిమెంటు రోడ్లు వేస్తే నివాసముంటున్న వీధుల్లో పరిస్థితులు మెరుగు పడుతాయని గ్రామస్తులు ఆశించేవాళ్లు. అయితే వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి సీఎం కావడంతో తంబళ్లపల్లె ప్రజల దుస్థితి మారిపోయింది. రాజంపేట పార్లమెంటు సభ్యులు పీవీ.మిథున్‌రెడ్డి, తొలిసారి ఎమ్మెల్యే అయిన పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఇక్కడి ప్రజలు కోరుకొంటున్న సిమెంటు రోడ్ల నిర్మాణంపై దృష్టి పెట్టారు. పలు మార్లు అధికారులతో సమావేశాలు నిర్వహించి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో తంబళ్లపల్లె నియోజకవర్గానికి సిమెంటు రోడ్ల కళ వచ్చింది.

ప్రతిచోట సిమెంటు రోడ్లు

2019 నుంచే తంబళ్లపల్లె నియోజకవర్గ గ్రామీణులకు సిమెంటు రోడ్ల మహార్దశ పట్టింది. మొదట ఎక్కడెక్కడ సిమెంటు రోడ్ల అవసరాన్ని గుర్తించి మంజూరు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన అభివృద్ధి హామీ, పల్లెల్లో పర్యటించిన సమయంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి దృష్టికి వచ్చిన వినతులతో నివేదికలు సిద్ధం చేసి మంజూరు చేయించారు. ఈ అభివృద్ధికి మాజీ మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి సహకారం అందించాం. దీంతో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఒకేసారి 1,875 సిమెంటు రోడ్డు పనులకు అనుమతులు ఇచ్చింది. తర్వాత పనులు చేపట్టి గ్రామాల్లో సిమెంటు రోడ్లను నిర్మించి ప్రజలకు సౌకర్యం కల్పించారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో...

జూన్ 4 నాటికి సీసీ రోడ్ల ప్రగతి
మంజూరైన సిమెంటురోడ్లు: 1,875
కిలోమీటర్లు : 223.11
అంచనా వ్యయం: రూ.70.35 కోట్లు
పూర్తయిన రోడ్లు: 581
కిలోమీటర్లు: 64.65
చేసిన ఖర్చు: రూ.21.12 కోట్లు
చేపట్టాల్సిన రోడ్లు: 1,294
కిలోమీటర్లు : 158.46
చేయాల్సిన వ్యయం: రూ.49.23 కోట్లు

మండలాల వారీగా సిమెంటురోడ్లు

మండలం	పనులు	విలువ(కోట్లలో)
బి.కొత్తకోట	204	రూ.9.42
పి.టి.సముద్రం	433	రూ.16.99
తంబళ్లపల్లె	259	రూ.12.54
కురబలకోట	194	రూ.9.08
పెద్దమండ్యం	424	రూ.9.76
ములకలచెరువు	361	రూ.11.61

కొత్తగా రూ.7 కోట్ల పనులే

పల్లె పండగ పేరుతో కూటమి ప్రభుత్వం హడావుడి చేస్తోంది. తంబళ్లపల్లె నియోజకవర్గానికి సిమెంటు రోడ్ల కోసం మంజూరు చేసింది కేవలం రూ.7.33 కోట్లే. ఆరు మండలాలకు కలిపి 125 పనులు మంజూరు చేస్తే పెద్దమండ్యంలో ఒకటి, తంబళ్లపల్లెలో ఒకటి మాత్రమే పనులు పూర్తి చేశారు. సంక్రాంతి లోపు పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం చెప్పినా ఆచరణలో మాత్రం పనులు పడకేశాయి. ఎక్కడ పనులు జరుగుతున్నాయో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. దీనిపై ఉన్నతాధికారులు సమావేశాలు నిర్వహించినా, సమీక్షలు చేసినా సిమెంటు రోడ్ల పనులు ముందుకు కదలడం లేదు. దీనితో కూటమి ప్రభుత్వ చర్యలు ఆచరణలో పడకేశాయి.

జగన్ స్ఫూర్తి కొనసాగిస్తాం



ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం అందించడంలో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తిని కొనసాగిస్తాం. తంబళ్లపల్లె ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం తారురోడ్లు, సిమెంటు రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇచ్చాం. 2019 నుంచి జరిగిన అభివృద్ధి పనులే గత ప్రభుత్వ చిత్తశుద్ధికి సాక్ష్యాలు. అభివృద్ధి విషయంలో నిరంతరం పనిచేస్తూనే ఉంటాం.

–పీవీ మిథున్‌రెడ్డి, రాజంపేట ఎంపీ

అభివృద్ధికి పెద్దపీట



తంబళ్లపల్లె నియోజకవర్గంలో అభివృద్ధికి పెద్దపీట వేశాం. ప్రజల సమస్యల పరిష్కారం కోసమే కృషి చేశాను. మాజీ మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి సహకారంతో 75 ఏళ్లలో జరగని అభివృద్ధి, రహదారుల ప్రగతి, సిమెంటు రోడ్ల నిర్మాణం చేపట్టి పూర్తి చేశాం. రూ.70 కోట్లతో సిమెంటు రోడ్లు మంజూరు చేయించి నిర్మించాం.

–పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే

రేపు అంబలం పూజ

మదనపల్లె సిటీ: స్థానిక సత్సంగ్ ఫౌండేషన్ వద్దనున్న మణికంఠ నగర్‌లో డిసెంబర్ 1న (ఆదివారం) అంబలం పూజ నిర్వహిస్తున్నట్లు అయ్యప్పగురుస్వామి మహేష్ తెలిపారు. సాయంత్రం 7 గంటలకు జరిగే పూజకు అయ్యప్పమాలాధారులు, భక్తాదులు అంబళం పూజలో పాల్గొనాలని సూచించారు. స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

రైతు ఆత్మహత్యాయత్నం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రైతు శ్రీనివాసులు

ములకలచెరువు: అప్పుల బాధ తాళలేక ఒక రైతు ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మండలంలోని బొంతలవారిపల్లెకు చెందిన ఎస్. శ్రీనివాసులు (45) వ్యవసాయం కోసం రూ.5 లక్షలు అప్పు చేశాడు. అప్పు ఇచ్చిన వ్యక్తులు ఒత్తిడి చేయడంతో మనస్థాపం చెందాడు. దీంతో పురుగులు మందు తాగి వ్యవసాయ పొలం వద్ద అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు గమనించి 108 సహాయంతో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి వైద్యుల సూచనల మేరకు తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అపార్ నమోదుకు అష్టకష్టాలు

- విద్యార్థులకు తప్పని అవస్థలు
- అసహనం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు


ఆధార్ క్యాంపులో వేచి ఉన్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

పెద్దమండ్యం: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అపార్ నమోదు ప్రక్రియ వేదన భరితంగా మారింది. తప్పనిసరిగా నమోదు చేయాల్సిందేనని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేయడంతో ఉరుకులు, పరుగులు మొదలయ్యాయి. అపార్ ఐడి కోసం ఆధార్ కార్డులో మార్పులు, చేర్పుల కోసం దరఖాస్తులు వందల్లో వస్తున్నాయి. అయితే ఒక్క ఆధార్ కేంద్రంలో మాత్రమే సేవలు కొనసాగుతుండడంతో రోజుకు 30 మంది విద్యార్థుల సమస్యలను మాత్రమే పరిష్కరిస్తున్నారు. దీంతో విద్యార్థులకు అపార్ అవస్థలు తప్పడం లేదు. వివరాలలోకి వెళితే మండలంలో నాలుగు రోజులుగా కలిచెర్ల, పెద్దమండ్యం, శిద్దవరం గ్రామాల్లో అధికారులు ప్రత్యేక ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేశారు. రోజుకు 30 దరఖాస్తులను మాత్రమే పరిశీలించి పరిష్కరిస్తున్నారు. దీంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు పనికాకపోవడంతో ఊసూరుమంటూ తిరిగి వెళుతున్నారు. రోజు ఆధార్ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేయలేక తల్లిదండ్రులు అసహనానికి గురవుతున్నారు. మండలంలో ప్రభుత్వం రెండు ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయగా.. ఒక కేంద్రంలో మాత్రమే ఆధార్ సేవలు నడుస్తున్నాయి. పెద్దమండ్యం గ్రామ సచివాలయంలో ఉన్న ఆధార్ కేంద్రంలో ఉన్న పరికరాలు పనిచేయడం లేదు. అధికారులు స్పందించి విద్యార్థులకు ఆధార్ సమస్యలను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సారూ.. దుర్వాసన!


పగలిపోయిన డ్రైనేజీ కాలువ పైకప్పు

మదనపల్లె సిటీ: దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని, చదువుపై దృష్టిసారించలేకపోతున్నామని స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ, మహిళా డిగ్రీ కాలేజీ విద్యార్థినులు వాపోతున్నారు. కాలేజీ ప్రహరీగోడ వద్దనున్న డ్రైనేజీ కాలువపై కప్పు పగలిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలేజీ అనుకుని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి ఉంది. ఆస్పత్రి నుంచి వస్తున్న వ్యర్థ పదార్థాలతో పాటు డ్రైనేజీ కాలేజీ కాంపౌండ్ చుట్టూ నిలిచిపోతుంది. వ్యర్థపదార్థాలు కుళ్లి దుర్వాసన వెదజల్లుతున్నాయి. జూనియర్ కాలేజీలో 620 మంది విద్యార్థులు ఉండగా, మహిళా డిగ్రీ కాలేజీలో సుమారు 520 మంది విద్యార్థినులు ఉన్నారు. దుర్వాసనను భరించలేక విద్యార్థులు కాలేజీ ప్రిన్సిపాల్ బాలకృష్ణమూర్తికి ఫిర్యాదు చేశారు. దీంతో డ్రైనేజీ కాలువను ప్రిన్సిపాల్ పరిశీలించారు. మున్సిపల్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలేజీ ప్రిన్సిపాళ్లు బాలకృష్ణమూర్తి, కృష్ణవేణి కోరారు.

పేరెంట్స్ మీటింగ్‌ను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న ఎంఈఓ రెడ్డిశేఖర్

బి.కొత్తకోట: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాల్లో వచ్చే నెల 7న నిర్వహిస్తున్న మెగా పేరెంట్స్ మీటింగ్ విజయవంతం చేయాలని ఎంఈఓ రెడ్డిశేఖర్ కోరారు. శుక్రవారం ఎమ్మార్సీలో అన్ని పాఠశాలల హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 7న విద్యార్థులు, తల్లిదండ్రులు, సంబంధిత టీచర్లతో విద్యార్థి సమర్థత, పరీక్షల్లో మార్కులపై ప్రోగ్రెస్ కార్డులు ఇచ్చి మిగిలిన అంశాలపై సమీక్షించి లోటుపాట్లను తెలియజేస్తామని తెలిపారు. ప్రతిపాఠశాలలో ఈ కార్యక్రమం నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాగా స్థానిక కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని ఎంపీడీఓ శంకరయ్య, ఎంఈఓ రెడ్డిశేఖర్ తనిఖీ చేశారు. పాఠశాలతో పాటు జూనియర్ కళాశాల నిర్వహణ, ఉపాధ్యాయుల పనితీరు, పరిసరాల శుభ్రతను పరిశీలించారు. విధి నిర్వహణ, భోజన నాణ్యత, భోదనపై సూచనలు చేశారు.

రేపు ఆత్మీయ సమావేశం

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం చిత్తూరు రోడ్డులోని వలసపల్లిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వేలాయుధన్ తెలిపారు. ఈ కార్యక్రమం బెంగళూరు రూరల్ నవోదయ ప్రిన్సిపాల్ చక్రవర్తి ఆధ్వర్యంలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. విద్యాలయ 13వ బ్యాచ్ (1998–2005) పూర్వ విద్యార్థులు, రజతోత్సవాన్ని పురస్కరించుకుని ఈ ఏడాది ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నామన్నారు. పూర్వ విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

చట్టాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న తహసీల్దార్ భీమేశ్వర్‌రావు

పీలేరు : చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ భీమేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం స్థానిక లక్ష్మీపురంలో పౌరహక్కుల దినం సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీల పట్ల వివక్షత చూపడం, కులం పేరుతో దూషించడం నేరమని తెలిపారు. ఈ విధంగా ఎక్కడైనా జరిగితే తమకు సమాచారం ఇవ్వాలని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రతి నెలా ఒక్కో ఎస్సీ, ఎస్టీ గ్రామాల్లో పౌరహక్కుల దినం సమావేశం నిర్వహించి సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మండల ఎస్సీ, ఎస్టీ పర్యవేక్షణ, సాధికారిత కమిటీ సభ్యులు ధరణికుమార్, మల్లికార్జున, సుధాకర్‌బాబు, సుభాష్, వెంకటేష్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలు చేయాలని కోరారు. మురుగునీటి కాలువల, చౌకదుకాణం, అంగన్‌వాడీ కేంద్రానికి, స్మశాన వాటికకు స్థలాన్ని కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ లోకేష్, డీటీ సుబ్రమణ్యం, ఎంఈఓలు లోకేశ్వర్‌రెడ్డి, పద్మావతి, ఈఓపీఆర్డీ లతీఫ్‌ఖాన్, వీఆర్ఓ ఇబ్రహీం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కనుల పండువగా లక్ష్మీనరసింహుడి కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. శుక్రవారం స్వాతి నక్షత్రం, ఇదే రోజు స్వామివారి జన్మదినం కావడంతో టీటీడీ ఆధ్వర్యంలో స్వామి వారికి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో చలువ పందిళ్లు, పచ్చని తోరణాలతో పెళ్లి వేదికను అందంగా అలంకరించారు. ముందుగా మూలవర్లకు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే స్వామి వారికి క్షీరాభిషేకం చేశారు. వేదపండితులు మంత్రోచ్ఛారణల మధ్య మేళతాళాలతో శాస్త్రోక్తంగా మాంగల్యధారణ కావించారు. పెద్ద ఎత్తున భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొని స్వామివారిని సేవించుకొన్నారు. ఈ కార్యక్రమంలో అర్చకులు గోపాలాబట్టర్, కృష్ణస్వామి, రాజు, అనిల్, గోకుల్ స్వాములు, టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

మాలల సింహ గర్జనను జయప్రదం చేయండి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాలమహానాడు నాయకులు

పీలేరురూరల్ : ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ క్రిమిలేయర్ తీర్పును రద్దు చేయాలనే డిమాండ్‌తో డిసెంబర్ 15న గుంటూరులో నిర్వహించనున్న మాలల సింహగర్జన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మాలమహానాడు ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రం నారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం మాలల సింహగర్జన పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాల మేధావులు, రాజకీయ నాయకులు, మాల ఉద్యోగులు, అంబేడ్కర్ వాదులు, మాల విద్యార్థులు లక్షలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు ఐక్యవేదిక మండల అధ్యక్షుడు మల్లికార్జున, నాయకులు రామాంజులు, నక్క వెంకటరమణ, గుండ్లూరి జయరామచంద్రయ్య, మోహన్ బాబు, ఊటుపల్లె రమణ, లోకనాథ పాల్గొన్నారు.

వీఆర్ఓల సంఘ అధ్యక్షుడిగా వేణుగోపాల్‌రెడ్డి


వీఆర్ఓల నూతన కమిటీ సభ్యులు

తంబళ్లపల్లె: తంబళ్లపల్లె మండలం వీఆర్ఓ సంఘం అధ్యక్షుడిగా కన్నెమడుగు వీఆర్ఓ వేణుగోపాల్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్ఓలు సమావేశమై సంఘ సభ్యులను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా సలీంబాషా, కార్యదర్శి సంజీవ్, కోశాధికారిగా నాగరాజు, సంఘ సలహాదారులుగా షంషాద్‌వల్లి, కార్యవర్గసభ్యులుగా రాజగోపాల్ ,శ్రీరాములు, వెంకటేష్‌ను ఎన్నుకున్నారు. వీఆర్ఓల సమస్యలపై వెంటనే స్పందించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని, సంఘ బలోపేతానికి సమిష్టిగా పని చేస్తామని నూతన సంఘం సభ్యులు తెలిపారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

మదనపల్లె : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, సీడాప్, డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆధ్వర్యంలో ప్రతినెలా జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నామని, వీటిని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని డిస్ట్రిక్ట్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వి.వెంకటేష్ సూచించారు. స్థానిక ప్రభుత్వ మోడల్ రెసిడెన్సియల్ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం జరిగిన జాబ్‌మేళాలో రెండు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. జాబ్‌మేళాకు 28 మంది అభ్యర్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కే.ఓబులేసు, ఏపీఎస్ఎస్‌డీసీ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధితోనే సమాజాభివృద్ధి

తంబళ్లపల్లె: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధిస్తేనే సమాజం అభివృద్ధి చెందుతుందని ఇండియన్ బ్యాంకు సీజెడ్ఎం బాలచంద్రమోహన్ అన్నారు. శుక్రవారం శ్రీశక్తి భవనంలో సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ మండలంలోని మహిళా సంఘ సభ్యులు బ్యాంకురుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బ్యాంకు రుణాలు సకాలంలో చెల్లిస్తే తిరిగి రుణాలు మంజూరు చేస్తామన్నారు. జీవన ప్రమాణాలు పెంచుకుని ఉన్నత స్థాయికి ఎదిగే విధంగా మహిళా సభ్యలను చైతన్యపరచాలని సూచించారు. సమావేశంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు రామలక్ష్మి, ఇండియన్ బ్యాంకు మేనేజర్ హరినాథ్‌గుప్తా పాల్గొన్నారు.

30 లీటర్ల సారా స్వాధీనం

మదనపల్లె : సారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ భీమలింగ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నిమ్మనపల్లె మండలం సామకోటవారిపల్లె గ్రామశివారులో నాటుసారా తరలిస్తున్న దిగువపల్లెకు చెందిన వి.నాగరాజ (29)ను అరెస్ట్ చేసి, 30 లీటర్ల నాటుసారా, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్ఐ డార్కస్, హెడ్‌కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, నాగయ్య, కానిస్టేబుళ్లు నాగరాజు, మణి పాల్గొన్నారు.

రాయల్ క్రాఫ్ట్ బజార్ ప్రదర్శన ప్రారంభం

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణంలోని మిషన్ కాంపౌండ్‌లో రాయల్ క్రాఫ్ట్ బజార్ చేనేత హస్తకళ ప్రదర్శనను ప్రారంభించినట్లు నిర్వాహకులు వెంకటేశ్వర్లు, మేనేజర్ నగేష్ తెలిపారు. ఇందులో కళంకారి శారీస్, వరంగల్ టవల్స్, కొండపల్లి బొమ్మలు, బెంగాల్ శారీస్ ప్రదర్శనలో ఉంచినట్లు తెలిపారు.

గోతుల మయం.. ప్రయాణం భయం..!

- అవస్థలు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని పాలకులు


ఖండ్రిగ గ్రామం సమీపంలో ఎన్‌హెచ్ 34 జాతీయ రహదారిపై ఏర్పడిన గోతులు

గుర్రంకొండ: ఎన్‌హెచ్ 340 జాతీయ రహదారి పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఎక్కడికక్కడ గోతులు పడినా పట్టించుకునేవారు కరువయ్యారు. ఫలితంగా వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల పరిధిలోని గాజులవారిపల్లె నుంచి కేశాపురం క్రాస్ వరకు ఉన్న ఎన్‌హెచ్ 340 జాతీయ రహదారి పలుచోట్ల గోతుల మయంగా మారింది. రోజురోజుకు రోడ్లు దెబ్బతింటున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. సకాలంలో మరమ్మతులు చేపట్టక పోతే కోట్లాది రుపాయలు ఖర్చు చేసి నిర్మించిన రోడ్లు పూర్తిగా దెబ్బతినే అవకాశముందని ప్రజలు చర్చించుకొంటున్నారు.

అధికారుల నిర్లక్ష్యం

రాయచోటి– అంగళ్లు వరకు ఎన్‌హెచ్ 340 జాతీయ రహదారిని ఆరేళ్ల కిందట నిర్మించారు. రూ.225 కోట్లతో అప్పట్లో ఈ రోడ్డును నిర్మించారు. అయితే ఏళ్ల తరబడి మన్నిక ఉండాల్సిన జాతీయ రహదారి కొన్నేళ్లకే అక్కడక్కడ దెబ్బతింది. గాజులవారిపల్లె నుంచి గుర్రంకొండ వరకు ఉన్న జాతీయ రహదారిపై పలు చోట్ల గోతులు ఏర్పడ్డాయి. రోడ్డు మధ్యలో.. రోడ్డు పక్కన గోతులు ఏర్పడ్డాయి. కొన్నిచోట్ల గోతులు మరీ ఎక్కువగా ఉండడంతో ద్విచక్రవాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఖండ్రిగ, మార్కెట్‌యార్డు పరిసరాల్లో ఉన్న రోడ్లు మధ్యలోను, ఇరువైపులా కోసుకు పోతున్నాయి. గుర్రంకొండ నుంచి కేశాపురం క్రాస్ (చిన్నమండ్యం మండల సరిహద్దు) వరకు ఉన్న ఈ రహదారిపై కూడ పలుచోట్ల గోతులు ఏర్పడ్డాయి. రహదారిపై దెబ్బతిన్న చోట్ల మరమ్మతులు చేయాల్సిన అధికారులు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.